# మినీకథలు




"వహాలవల్లి దగ్గిర పెద్ద చెరువు పక్కనున్న నా ఇరవై ఎకరాల పొలం లాండ్ సీలింగ్‌లో పోయేలా వుంది. పట్టణాభివృద్ధిసంస్థవారు కూడా అక్కడ ఏదైనా 'షాపింగ్ కాంప్లెక్సు' కడితే బావుంటుందని ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ఆ గొడవల్లో పడకుండా ఎలాగైనా వెంటనే అమ్మేయాలి" అన్నాడు రెండో రౌండు సీమ సరుకు కొడ్తూ ధర్మారావు పానకాలరావుతో.

"రేటు ఎంతలో వుంటాది?"

"ఎకరానికో యాభై వేలు రాదంటావా?"

"ఇరవై ఐదు వేలయితే చూద్దాం."

"ఇరవై ఐదు!! మొత్తం నిషా దింపేశావయ్యా....భలేవాడివే...." అన్నాడు ధర్మారావు గ్లాసులో మంచు నింపుకొని ఐసు ముక్కలు వేసుకుంటూ.

"కొన్నాడి నెత్తికి చెంగే కదా? దక్కిందే దక్కుడు....":

"మరీ దారుణం! మొత్తం ఐదు లక్షలకి పెరగదంటావ్?"

"ఆ రేటు ఫిక్స్ చేస్తే నేనే కొనేస్తా"

"సరే నువ్వు కొంటావని ఓ. కే. చేస్తున్నా."

"ఈలోగా మీ వాడెవడో మినిస్టర్ ఉన్నాడన్నారుగా....ఓ ఆర్నెల్లపాటు ఏ గొడవలూ రాకుండా చూడండి."

"అలాగే. పురోణీ ఎప్పుడు రాద్దాం."

"మీ ఇష్టం. వచ్చేవారం రాద్దాం..... మూడు నెలల్లో మొత్తం డబ్బు యిచ్చేస్తా. రిజిస్ట్రేషన్ చేయించుదాం."

"ఓకె."

"గుడ్‌నైట్!"

"గుడ్‌నైట్!"

* * *

ఇంటి గురించి చింతా!

పూలపల్లి దగ్గిర పెద చెరువు పక్కన లే అవుటు చేయబడ్డ జాగాలు మూడు వందల చదరపు గజాల చొప్పున ఖాళీ స్థలాలు ఇళ్ళుకట్టుకోడానికి అతి చౌకలో వున్నాయి....అప్లికేషన్, వివరాలకు పది రూపాయిల మనియార్డర్ ఈ క్రింది చిరునామాకి చేయండి :

ప్రెసిడెంట్
భస్మాసుర కోపరేటివ్ సొసైటీ
పోస్టుబాక్స్ నెం : 420.

ఎస్. ఎస్. ఎల్. సి. జన్మలో పాసవదని నిశ్చయించాక, అప్పటికే చాలాసార్లు సినిమాహాల్లో బ్లాకులో టిక్కెట్లు అమ్ముతూ పోలీసు కస్టడీ రుచిచూసిన మూడో పెళ్ళాం రెండో తమ్ముడు అప్పారావుని విజయనగరం నుంచి లాక్కొచ్చి నమ్మకమైన శిష్యులు మరో పదిమందితో భస్మాసుర కోపరేటివ్ సొసైటీ రిజిష్టర్ చేయించాడు పానకాలరావు.

ప్రజాసేవ చేయడానికి సినిమాల్లో బ్లాకులో టిక్కెట్ల అమ్మకం కాకుండా, బ్రోతల్ హౌస్ పెట్టడమా, రాజకీయాల్లో దిగడమా, కంట్రాక్టర్ అయి కౌన్సిలర్ అవడమా అని ఆలోచిస్తున్న అప్పారావుని కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా చేసి ఓదారి చూపించాడు పానకాలరావు.

పై ప్రకటన పేపర్లలో ప్రకటించి. కరపత్రాలు అచ్చేయించి పంచిపెట్టి ప్రచారం చేశాడు పానకాలరావు.

* * *

సుమారు ఒక నెల తర్వాత—

"సొసైటీ పేర్న ఎంత డబ్బుంది అప్రావ్!" అన్నాడు పానకాలరావ్ ఓ ఖరీదైన హోటల్‌లో సీమసరుకుతో అప్పారావు గ్లాసులు నింపుతూ.

"సుమారు ఆరున్నర లక్షలు....వివరాలు అప్లికేషన్ పంపమని వచ్చింది ఓ పదివేలు, మెంబర్‌షిప్‌ల ఎమౌంటు ఓ ఆరువేలు, నాల్గువందలమంది కట్టిన డిపాజిట్ ఆరు లక్షలు, ఇంకా బ్యాంకు వడ్డీ....లెక్కలు రేపు చూసి చెప్తాను ఖచ్చితమైంది."

"అదిసర్లే....రేపు ఐదు లక్షల చిల్లరా బ్యాంకులోంచి తియ్యి. నేను ఆ జాగా మీ సొసైటీకి పన్నెండు లక్షలకి అమ్ముతున్నట్టు నాకు అడ్వాన్సు ఇచ్చినట్టు వచ్చేవారం పురోణీ రాయించు. ఈలోగా ఆ ఐదు లక్షలు ధర్మారావుగాడి మొఖాన పడేసి ఆ జాగా నా పేర్న రిజిస్టర్ చేయిస్తాను.. మెంబర్లకి మూడువందల జాగాలే వున్నాయని, లాట్రీలో తీస్తామని అలా లాట్రీలో వచ్చినవార్ని మనం నోటీసుయిచ్చిన వారం రోజుల్లోగా మిగిలిన మూడువేలు కట్టమను. లాట్రీలు రానివారి వాళ్ళ పదిహేను వందలూ డిపాజిట్టు పది పదిహేను రోజుల్లోగా రిటర్న్ చేస్తామని ఓ సర్క్యులర్ పంపు" అన్నాడు పానకాలరావు రెండో బాటిల్ ఓపెన్ చేస్తూ.

"లక్షా యాభై వేలు మళ్ళీ రిటర్న్ చెయ్యడమే! అసలు మొత్తం డబ్బు డ్రా చేసి పారిపోతే?"

"ఓరి ఎర్రి లంజకొడకా....ప్రజాధనంరా....ఎదవ ఆలోచన్లు చేస్తే ఎముకలేరేస్తారు. శిఖవా ఎప్పుడూ పొముగు కోసే కూడదు. వాళ్ళ డబ్బు వాళ్ళకిచ్చేసి మన నిజాయితీ నిరూపించుకోవాలి. మనం ప్రజాసేవకులం. నెమ్మదిగా నీకూ జ్ఞానోదయం అవుతుంది మరో పెగ్ వేసుకో. ఈ లెక్క విను:

"అప్లికేషన్ వివరాలకోసం పంపిన పది వేలు, మెంబర్‌షిప్‌లు ఆరువేలు, జాగా ధర

భమిడిపాటి
అనంతనారాయణ

[redacted]

బ్యాంకువడ్డీ అన్నీ కలిపి పదిహేను లక్షల పైన వస్తుంది. ఐదు లక్షలు ధర్మారావు గారికి లక్షన్నర జాగాలు దొరకని వారికి రిటర్న్ చేస్తే మన ఖర్చులు పోను ఖచ్చితంగా ఏడెనిమిది లక్షలు మిగులుతుంది. పావలా వాటా నీది. అర్థమైందా- వెధవ వేషాలు వెయ్యకు. నేను ఆ జాగా మీ సొసైటీకి పన్నెండు లక్షలకి అమ్ముతున్నట్టు వచ్చేవారం పురోణీ రాయించి మెంబర్ల దగ్గర మిగతా బాలన్సు మూడువేలు కలక్ట్ చెయ్యి...."

"నీ బుర్ర జీనియస్ గురూ...నన్ను మాత్రం కౌన్సిలర్‌ని చేయాల."

"అలాగే!"

*　　*　　*

అలా పావలా వాటా సుమారు రెండు లక్షలు ఆర్జించిన అప్పారావు తర్వాత ఎలక్షన్లలో ఆ పెట్టుబడితో కౌన్సిలర్ అయ్యాడు. ముప్పావలా వాటా ఆర్జించిన పానకాలరావు మినిస్టర్ అయ్యాడు. మూడువందల చదర గజాలు నాల్గువేల ఐదు వందల రూపాయలకు భస్మాసుర కోపరేటివ్ సొసైటీలో జాగాలు కొన్న మూడు వందలమంది ఆ జాగా లాండ్ సీలింగ్‌లో పోవడంవల్ల ప్రభుత్వంవారి నుంచి ఒక్కొక్కరు సుమారు ఐదువందల రూపాయలు నష్టపరిహారం పొందేరు. ●

---

ఎంబ్రాయిడరీ పని చేసే ఏబులమ్మకు, అరవై ఏళ్ళ వయసులో అయిదు లక్షలు అస్సాం లాటరీ వచ్చింది! ఏబులమ్మకు ఎప్పటినుంచో ఒక తీరని కోరిక వుంది. పింక్ కలర్ పియట్ కారులో భర్తతో పిక్‌నిక్‌కు వెళ్ళాలని. అయితే అస్సాం లాటరీ పుణ్యమా అని అయిదు లక్షలు వచ్చాయి కాని డ్రైవింగ్ రాదుగదా! అందుకని అట్టే ట్రాఫిక్ వుండని రోడ్లమీద అర్థరాత్రి డ్రైవింగ్ నేర్చుకోవటం ప్రారంభించింది. పదిరోజులు తిప్పలుపడి చివరికి, డ్రైవింగ్ ఆయువుపట్లన్నీ పట్టింది. డ్రైవింగ్ లైసెన్సు సంపాదించింది!

ఓ శుభముహూర్తాన మెయిన్‌రోడ్డుమీద ఆమె ప్లిమత్ దూసుకు పోతోంది. అయితే ఎర్ర సిగ్నల్ లైటు వెలుగుతుంటే ఆగాలని, ఆకుపచ్చలైటు వెలిగితేనే ముందుకు పోవాలని ఏబులమ్మకు గుర్తుంది. కాని కర్మవశాత్తు దూరపుచూపు ఆనని దృష్టి లోపం వుండటంతో, ఎర్రలైటు వెలుగుతున్నా ముప్ఫయిమైళ్ళ వేగంతో ముందుకు దూసుకు పోయింది.

ఏబులమ్మ వాళ్ళలాంటి వాళ్ళ కోసం ఎదురుచూస్తున్న కానిస్టేబుల్ కమలాపతి ఏబులమ్మ మీద కేసుపెట్టి బోను ఎక్కించాడు.

అయితే ఏబులమ్మ యీ సంఘటనకు భయపడలేదు. దర్జాగా బోనెక్కి మేజిస్ట్రేట్ ముందు "అయ్యా! కమలాపతి అనే యీ కానిస్టేబుల్ అన్యాయంగా నామీద కేసు బనాయించాడు. ఈ మధ్య మహిళలపట్ల పోలీసులు ఎంత ఘోరంగా ప్రవర్తిస్తున్నారో మీకు తెలియందికాదు. నాకు చూపు ఆనదని, డేంజర్‌లైట్ వెలుగుతున్నా నేను దృష్టిదోషంవల్లనో, ఉద్దేశ పూర్వకంగానో చట్టోల్లంఘన చేశానని ఇతని ఆరోపణ! నిజం చెప్పాలంటే ఆరోజు ఎర్రలైట్ వెలుగుతున్నా చూసుకోకుండా ట్రాఫిక్ రూల్స్‌కి వ్యతిరేకంగా కారు నడిపింది నేను కాదు! అది మరెవరిదో ప్లిమత్ కారు. ఈ కానిస్టేబుల్‌కే దృష్టిదోషముంది. ఇతను మరెవరి ప్లిమత్ కారునో నా ప్లిమత్‌కారుగా పొరపడ్డాడు!" అంది, వాగ్ధాటితో అదరగొడుతూ.

మేజిస్ట్రేట్ ఓ క్షణం ఆలోచించి "కానిస్టేబుల్‌కి దృష్టి దోషం వుందని ఆరోపించారు! బాగానే వుంది! అయితే ఈ ఆరోపణ నిజమని రుజువు చేయగలరా?" అన్నాడు.

"ఆహా! మీరు అవకాశం, అనుమతి యిచ్చేట్లయితే ఒక్కక్షణంలో ఆ పని ముగిస్తాను!" అంది ఏబులమ్మ. మేజిస్ట్రేట్ సమ్మతించిన వెంటనే ఏబులమ్మ కానిస్టేబుల్ కమలాపతి. మేజిస్ట్రేట్ చూస్తుండగా ఒక సూది తీసి పదిసార్లు సన్నటి దారాన్ని సూది కన్నులోకి ఎక్కించితీసి "చూశారుగా! దీన్ని బట్టి నాకు దృష్టి లోపం లేదని తెలుస్తూనే వుందిగా!" అంది.

మేజిస్ట్రేట్ నోరు తెరచి చూస్తుండగా, "ఇప్పుడు నేను పదిసార్లు అవలీలగా చేసిన పని యీ కానిస్టేబుల్ ఒక్కసారి చేయగలిగితే మీరు ఏ శిక్ష విధించినా పడతాను!" అంది ఏబులమ్మ సవాల్ విసురుతున్నట్టు.

మేజిస్ట్రేట్ కానిస్టేబుల్ కమలాపతిని ఏబులమ్మలా సూదిలోకి దారం ఎక్కించమన్నాడు.

పదిసార్లు ప్రయత్నించినా కమలాపతి ఒక్కసారీ సూదిలోకి దారం ఎక్కించలేకపోయాడు.




"అరవయ్యోపడిలోవున్న నాకున్నపాటి దృష్టి దారుఢ్యం, యువకుడైన ఈ కానిస్టేబుల్‌కు లేకపోయింది. ఇక న్యాయం మేజిస్ట్రేట్‌గారే దయచేయాలి!" అంది ఏబులమ్మ.

మేజిస్ట్రేట్ కేసు కొట్టివేస్తూ, కమలాపతికి కళ్ళజోడు రికమండ్ చేశాడు. ఏబులమ్మ వృత్తేమిటో ఆయనకు తెలియదు! ●

ఎమ్. డి. సౌజన్య